క్లుప్తంగా

కొడిపల్లి కళాశాల ప్రిన్సిపాల్‌గా వెంకటసుబ్బయ్య



కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వెంకటసుబ్బయ్య నియామకమయ్యారు. ఇక్కడ విధులు నిర్వహించిన వెంకటరామారావు బదిలీపై చేవెళ్ల వెళ్లారు. శివ్వంపేట కళాశాలలో విధులు నిర్వహించిన వెంకటసుబ్బయ్య కౌడిపల్లికి బదిలీపై వచ్చారు. దీంతోపాటు కళాశాలలో విధులు నిర్వహించిన లెక్చరర్లు శ్రీకాంత్, మంగమ్మ, శ్రీలత, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, రికార్డు అసిస్టెంట్ అహ్మద్‌ఉమర్ బదిలీపై వెళ్లారు. ఇక్కడికి కొత్తగా లైబ్రరీయన్ మాధవి, జూనియర్ అసిస్టెంట్ ఖలీల్, రికార్డు అసిస్టెంట్ సుధాకర్ బదిలీపై వచ్చారు.

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి



కౌడిపల్లిలో నీటితొట్టిలోని మురికి నీటిని పారబోయిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం కౌడిపల్లిలోని పలు కాలనీల్లో ఐసీడీఎస్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా నిరుపయోగంగా ఉన్న నీటితొట్లు, పారేసిన కొబ్బరి బోండాలు, టైర్లు, డబ్బుల్లో నీళ్ల నిల్వ ఉంచొద్దని సూచించారు. ఎక్కువ రోజులు నీరునిల్వ ఉన్నట్లయితే దోమలు పుడుతాయని దీంతో వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. పరిసరాలకు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్లు లక్ష్మి, ఖమర్‌సుల్తాన, ఇన్‌చార్జి ఎంపీఓ వెంకటేశం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

దివ్యాంగుల శ్రేయస్సు పట్టని ప్రభుత్వం


దివ్యాంగుల హక్కుల సమితి జిల్లా అధ్యక్షుడు పాండు



మాట్లాడుతున్న పాండు

రామాయంపేట(మెదక్): దివ్యాంగుల శ్రేయస్సు విషయమై ప్రభుత్వం పట్టించుకోవడంలేదని దివ్యాంగుల హక్కుల సమితి జిల్లా అధ్యక్షుడు పాండు ఆరోపించారు. శుక్రవారం రామాయంపేటలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం దివ్యాంగుల ఫించన్ రూ. 6 వేలకు పెంచాలన్నారు. ఈనెల ఏడున మెదక్‌లో జరిగే సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ఇతర రాష్ట్ర ప్రతినిధులు రాంబాబు, సుజాత హాజరవుతారని పాండు పేర్కొన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగారాం, సమితి జిల్లా ఉపాధ్యక్షుడు భూమయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుమార్, మండలాధ్యక్షుడు మహేష్, చేగుంట మండలాధ్యక్షుడు వస్రాం, తదితరులు పాల్గొన్నారు.

అందరూ మొక్కలు నాటాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ

తూప్రాన్: వనమహోత్సవంలో భాగంగా అందరూ మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 5వ వార్డులో మొక్కలు నాటారు. అనంతరం చిల్డ్రన్ హైస్కూల్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, రవీందర్‌గుప్తా, రఘుపతి, కమిషనర్ ఖాజా మోహిజొద్దీన్, వరప్రసాదం, మోజేస్, తదితరులు పాల్గొన్నారు.

అంగడి స్థలం మార్పు

నర్సాపూర్: పట్టణంలో ప్రతీ శుక్రవారం జరిగే అంగడి స్థలాన్ని శుక్రవారం నుంచి మార్పు చేశారు. అంగడి మహాత్మాగాంధీ విగ్రహం నుంచి ఎస్‌బీఐ రోడ్డుపై నిర్వహించాలని ఇటీవల మున్సిపాలిటీ పాలక కమిటీ తీర్మానించింది. వ్యాపారులకు మున్సిపల్ సిబ్బంది సూచించగా.. పలువురు తాము పాత ఏరియాలోనే తమ దుకాణాలు ఏర్పాటు చేసుకుంటామని చెప్పారు. దీంతో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్‌ను వ్యాపారులు కలిసి వచ్చే వారం నుంచి కొత్త ఏరియాలో దుకాణాలు ఏర్పాటు చేస్తామని ఆయనకు తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

– జెడ్పీ సీఈఓ ఎల్లయ్య



శివ్వంపేట(నర్సాపూర్): దొంతిలో పరిసరాలను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఎలాంటి రోగాలు దరిదాపుల్లోకి రావని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అన్నారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా మండల పరిధిలోని దొంతి గ్రామాన్ని సందర్శించి పరిసరాలు పరిశీలించి సిబ్బందికి, గ్రామస్తులకు సూచనలు చేశారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు పిచ్చిమొక్కలు తొలగించాలని, మురికి కాల్వలు శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యదర్శులు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ గ్రామ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, సీనియర్ అసిస్టేంట్ నరేందర్‌రెడ్డి, కార్యదర్శి శేఖర్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

– శివ్వంపేట(నర్సాపూర్):

మున్సిపాలిటీలో ఫ్రైడే- డ్రైడే



రామాయంపేటలో ఇళ్లవద్ద నిలువ ఉన్న నీటిని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది.

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలో శుక్రవార ఫ్రైడే -డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ దేవేందర్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్య పరిస్థితిని సమీక్షించారు. ఇళ్ల ఎదుట కుండీలు, మొక్కల వద్ద నిలువ ఉన్న నీటిని తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ యాదగిరి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకుంటూ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. మండలంలోని గౌతాపూర్ గ్రామంలో డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాట్లాడుతూ.. వర్ష కాలం సీజన్‌లో ఇంటి ఆవరణలో, ఇంట్లో ఉన్న డ్రమ్ములు, టైర్లు, పాడేసిన కొబ్బరిబొండాలు, ఖాళీ సీసాలు, పాడైన కూలర్లల్లో నీటి నిల్వ అయ్యేందుకు అవకాశం ఉంటుందన్నారు. తద్వారా దోమలు, సీజనల్ వ్యాధుల బారీన పడకుండా ఉంటారన్నారు. అదేవిధంగా మురికి కాల్వల్లో బ్లీచింగ్, మురికి గుంతల్లో అయిల్‌బాల్స్ వేయించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముసాద్దిక్, ఏపీఓ శ్యామ్, పంచాయతీ కార్యదర్శి శ్రావణిసింధూజ, తదితరులు పాల్గొన్నారు.



చిలప్‌చెడ్(నర్సాపూర్): గౌతాపూర్లో నిల్వ నీటిని పారబోయిస్తున్న ఎంపీడీఓ ఆనంద్

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని పలు వార్డుల్లో శుక్రవారం ఫ్రైడే – డ్రైడే నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జానకీరాం సాగర్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్, ఆశ కార్యకర్తలు, ఆర్పిలు, మున్సిపల్ సిబ్బంది, పాల్గొన్నారు.



మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలో నిల్వ నీటిని పారబోయిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

చిన్నశంకరంపేట(మెదక్): ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి నీలిమ అన్నారు. శుక్రవారం చిన్న శంకరంపేట మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె ఎంపీడీఓ దామోదర్‌తో కలిసి మండలంలోని అంబాజిపేట గ్రామంలో ఫ్రైడే డ్రైడేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి నిల్వ నీరు ఉండకుండా జాగ్రత్తపడాలని కోరారు. గ్రామాలో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమలంలో గ్రామ కార్యదర్శి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హరితం అస్తవ్యస్తం...!



గదిలో ఎండుతున్న మొక్కలు

కొల్చారం(నర్సాపూర్): మొక్కలు ఎండుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యం.. అలసత్వం వన మహోత్సవంలో నాటేందుకు తెచ్చిన మొక్కలను సంరక్షించట్లేదు. దీంతో అవికాస్త ఎండుతున్న దృశ్యం మండలంలోని చిన్నఘనాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో కనిపిస్తోంది. హరితహారం కింద ఒక మొక్కను నర్సరీలో పెంచి, నాటేందుకు ఈజీఎస్ సిబ్బంది చేస్తున్న ఖర్చు దాదాపు రూ.180 వరకు అవుతోంది. అలాంటిది దాదాపు 100 మొక్కలను నర్సరీ నుంచి తీసుకొచ్చి మొక్కలను నాటకుండా ఓ గదిలో పడేశారు. ఈ సంఘటన అధికారుల పనితీరుకు అద్దం పడుతుందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం ఆ మొక్కలు ఎక్కడికక్కడ విరిగిపోవడమే కాకుండా ఎండు ముఖం పడుతున్నాయి.

పాల డబ్బులు చెల్లించండి

పాల రైతుల ఆందోళన



పాల కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న పాల రైతులు

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లోని విజయ డైరీ పాలశీతల కేంద్రం వద్ద పాల రైతులు శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. మూడు నెలలుగా పాల డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ చేయడం లేదని, స్థానిక అధికారులకు సైతం చెప్పినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనూ చాలా సందర్భాల్లో కొందరు రైతులు తమ పాల డబ్బులు రాకపోవడంతో కేంద్రం చుట్టూ తిరిగి అలసిపోయి డబ్బులు అడగడం మానేశారన్నారు. విజయ డైరీ పాల కేంద్రం నిర్వాహకులు సైతం డబ్బుల పంపిణీ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి, తమ పాల డబ్బులు తక్షణమే ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఇందులో పాల రైతులు మున్నూరి రామకృష్ణ, వెన్నెల సాయిలు, ఎక్కెల్లి శివకుమార్, సంగమేశ్వర్, ప్యారారం శివన్న, గొల్లరాములు ఉన్నారు.

త్వరలో పాల డబ్బులు

నెల పదిహేను రోజులకు సంబంధించిన పాల డబ్బులు రూ.2 లక్షలు రైతులకు ఇవ్వాల్సి ఉందని విజయడైరీ సూపర్‌వైజర్ సాయికుమార్ సాక్షికి వివరణ ఇచ్చారు. త్వరలో రైతులందరికీ పాల డబ్బులు చెల్లిస్తామని చెప్పారు.

డాక్యుమెంట్లు లేని వాహనాలు సీజ్



తనిఖీలు చేసి అదుపులోకి తీసుకున్న వాహనాలతో పోలీసులు

నర్సాపూర్: డాక్యుమెంట్లు వాహనాలు సీజ్ చేశామని సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో పలుచోట్ల తమ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేపట్టామని చెప్పారు. వాహనాలకు సంబంధించిన డాక్యుమెంట్లు లేని, నంబరు ప్లేట్లు లేని వాహనాలు అదుపులోకి తీసుకున్నామన్నారు. నంబరు ప్లేట్ తెచ్చిన వాహనదారులకు నిబంధనల మేరకు జరిమానా విధించి వాహనాలను అప్పగిస్తామని, డాక్యుమెంట్లు లేని వాహనాల యజమానులపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. తనిఖీల్లో ఎస్ఐ శ్రీనివాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారని అన్నారు. కాగా వాహనాలకు సంబంధించిన డాక్యుమెంట్లు వాహనంతో పాటు ఉంచుకోవాలని, ఇకపై ఆకస్మికంగా తనిఖీలు చేస్తామని, డాక్యుమెంట్లు లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపైన కోర్టు తీర్పు అనుకూలంగా రావడంతో సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మాదిగ సంఘం నాయకులు మాట్లాడుతూ.. మాదిగల హక్కుల కోసం అనేక మంది పోరాటాలు చేశామని, బీజేపీ ప్రభుత్వం మాదిగల పక్షాన వారికి అండగా నిలిచిందన్నారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



మెదక్ మున్సిపాలిటీ: ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాదిగ సంఘం మహిళలు



పాపన్నపేట(మెదక్): వర్గీకరణ పై ఆనందం వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీ ఎస్ నాయకులు



కొల్చారం(నర్సాపూర్): సంగాయిపేటలో స్వీట్లు తినిపిస్తున్న ఎమ్మార్పీ ఎస్ నాయకులు

పాఠశాలలో మద్యం బాటిళ్లు



పాఠశాల ఆవరణలో మద్యం బాటిళ్లు

హవేళీఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని మద్దుల్‌వాయి పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు మద్యం సేవించి బాటిళ్లను అక్కడే పడేశారు. దీంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పాఠశాల విద్యార్థులు పేర్కొన్నారు. నిత్యం ఇలాగే గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలలో మద్యం సేవించి మద్యం బాటిళ్లను పగులగొట్టడం ద్వారా అనేక అవస్థలు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

యువత మద్యంకు బానిస కావొద్దు

మెదక్‌రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి

హవేళీఘణాపూర్(మెదక్): యువత మద్యం, దుమపానంకు దూరంగా ఉండి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని మెదక్‌రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గంజాయి కట్టడి, మద్యం సేవించి రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగిన సమయంలో బాధితులే వచ్చే ఫిర్యాదు చేసే సందర్భాలు గతంలో ఉండేవని, కానీ ప్రస్తుతం అనుకోని ఘటనలు జరిగితే ప్రజలు 100కు కాల్ చేస్తే తమ సిబ్బంది వెళ్లి వారికి రక్షణ కల్పిస్తామని తెలిపారు. గంజాయి సరఫరాకు అడ్డుకట్ట వేస్తే గ్రామీణ ప్రాంతంలోకి చేరకుండా ఉండేందుకు పోలీసు శాఖ వాహనాల తనిఖీ చేపడుతుందన్నారు.

అంకిత భావంతో చదవాలి



శిక్షణ పొందిన విద్యార్థులతో జడ్జి అనిత

నర్సాపూర్: అంకిత భావంతో చదివి ప్రతిభావంతులు కావాలని జూనియర్ సివిల్ జడ్జి అనిత సూచించారు. పట్టణంలోని పీఎస్‌రెడ్డి ఉన్నత పాఠశాలలో మండల లీగల్ సర్వీస్ కమిటీ, పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, విధులు బాధ్యతలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పాఠశాల చైర్మన్ నర్సింహరెడ్డి మాట్లాడుతూ.. అమెరికాలోని హార్మోనిక్ సింఫోని ప్రాజెక్టు ఆధ్వర్యంలో తమ పాఠశాల విద్యార్థులకు 14 రోజుల నుంచి మ్యూజిక్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చానాయక్, రిటైర్డు హెడ్మాస్టర్లు సంఘం ప్రతినిధి గుండం మోహన్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలి

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం తల్లి పాల వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ మాట్లాడుతూ.. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు.



శివ్వంపేట(నర్సాపూర్): సామూహిక సీమంతం నిర్వహిస్తున్న సిబ్బంది



చిలప్‌చెడ్‌లో..



మనోహరాబాద్(తూప్రాన్): జీడిపల్లిలో..

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్



తూప్రాన్: పోలీసుల అదుపులోమాట్లాడుతున్న మాజీ సర్పంచ్‌లు

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం గ్రామాల్లోని పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌లు చలో అసెంబ్లీ తలపెట్టారు. దీంతో అసెంబ్లీకికి తరలుతున్న మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. బిల్లులు చెల్లించకపోవడంతో బతుకు ప్రశ్నార్థకంగా మారిందని వాపోయారు.

సంక్షిప్త వార్తలు

◆ **నర్సాపూర్ ఎస్ఐ బదిలీ**

నర్సాపూర్: నర్సాపూర్ ఎస్ఐ పుష్పరాజ్ బదిలీ అయ్యారు. ఆయన కామారెడ్డి జిల్లా రాజంపేట పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారని సీఐ జాన్‌రెడ్డి చెప్పారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరు రాలేదని తెలిపారు.

◆ **సూరారంలో వైద్యశిబిరం**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతోంది. గ్రామానికి చెందిన విద్యార్థి డెంగీతో మృతి చెందడంతో గ్రామంలో నాలుగు రోజులుగా వైద్య శిబిరం కొనసాగుతోంది. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిసింధు ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే నిర్వహిస్తుండడంతో పాటు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం వైద్య శిబిరంలో 48 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మలేరియా జిల్లా అధికారి విజేందర్, పల్లె దవాఖాన వైద్యులు, సీహెచ్ఓ యాదగిరిరావు పాల్గొన్నారు.

◆ **రైతులందరికీ రుణాలు అందిస్తాం**

పాపన్నపేట(మెదక్): ప్రభుత్వం ఆదేశాలతో రుణమాఫీ పొందిన రైతులందరికీ కొత్త రుణాలు పంపిణీ చేస్తామని రైతు సహకార సంఘం అధ్యక్షుడు రమేష్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. అర్హులైన రైతులకు రుణాలు అందజేస్తామన్నారు.

◆ **పాపన్నపేట ఎస్ఐగా శ్రీనివాస్ గౌడ్**

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట ఎస్ఐగా శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడ పని చేసిన నరేశ్ కామారెడ్డి జిల్లా రామారెడ్డి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. కాగా మాచారెడ్డి ఎస్ఐగా పని చేసిన శ్రీనివాస్‌గౌడ్ పాపన్నపేటకు వచ్చారు.

◆ **మున్సిపల్ 7వ వార్డులో ..**

తూప్రాన్: మున్సిపల్ పరిధిలో మున్సిపల్ 7వ వార్డు అల్లాపూర్‌లో సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రతపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ ఖాజామోహిజొద్దీన్, మేనేజర్ రఘువరన్, జూనియర్ అసిస్టెంట్ దుర్గయ్య, శానిటరీ ఇన్స్‌పెక్టర్ కుమార్, ఎన్విరాన్మెంటల్ మధు, వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, పారిశుద్ధ సిబ్బంది పాల్గొన్నారు.

◆ **ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి**

వెల్దుర్తి(తూప్రాన్): ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరని సీడీపీఓ స్వరూప అన్నారు. మండలంలోని ఎం.జలాల్‌పూర్ అంగన్‌వాడీ టీచర్ అంజమ్మ పదవీ విరమణ సందర్భంగా తోటి సిబ్బంది అంజమ్మను సన్మానించారు.

◆ **అండగా ఉంటాం**

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబానికి అండగా ఉంటామని బీజేపీ రాష్ట్ర నాయకుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ అన్నారు. మండలంలోని గంగాయిపల్లి గ్రామానికి చెందిన మిషన్ భగీరథ హెల్పర్ ఒగ్గు భిక్షపతి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశాడు. కార్యక్రమంలో జిల్లా ఎరుకల సంఘం అధ్యక్షుడు భిక్షపతి, నాయకులు ఉన్నారు.

◆ **వీధిబల్బుల పంపిణీ**

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామ పంచాయతీకి వీధిబల్బులను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తారా విష్ణువర్ధన్‌రెడ్డి పంపిణీ చేశారు. శుక్రవారం మండలంలోని చిట్కుల్ గ్రామ పంచాయతీకి 80 బల్బులు, కేబుల్స్, హోల్డర్స్ తదితర సామగ్రిని పంచాయతీ కార్యదర్శి తిరుపతికి అందజేశారు.

◆ **రామాయపల్లిలో ఉచిత వైద్య శిబిరం**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని రామాయపల్లిలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యురాలు స్వప్న తెలిపారు. పంచాయతీ కార్యదర్శి మల్లేశ్, ఆశ వర్కర్ పద్మావతి, అంగన్‌వాడీ టీచర్ సునీత, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

◆ **జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శశిధర్**

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శశిధర్ బాధ్యతలు స్వీకరించారు. నార్సింగి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్ నియామకం అయ్యారు.

◆ **అంగన్‌వాడీ కేంద్రాలకు చేయూత**

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని దొంతిలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు గ్రామ వాసి, బజరంగీ సేన అధ్యక్షుడు అంజి శుక్రవారం చేయూతనందించారు. కేంద్రాల్లో చిన్నారులు కూర్చోవడానికి కార్పేట్లు, ప్లేట్స్, ఆట వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

◆ **మాజీ ఉపసర్పంచ్ మృతి**

నర్సాపూర్: నర్సాపూర్ మాజీ ఉపసర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు తొంట వెంకటేష్(52) మృతి చెందారు. శుక్రవారం ఆయన ఆస్పత్రిలో మరణించాడని కుటుంబీకులు తెలిపారు.